

దండేపల్లిలో నినదిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్



దండేపల్లిలో సమావేశానికి హాజరైన ప్రజలు

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- అభివృద్ధి చేశా.. మళ్లీ ఆశీర్వదించండి
- 3గంటల కరెంట్‌తో రైతులకు నష్టం
- కరెంట్, నీళ్లు ఇచ్చాం... పంటలు కొంటున్నాం
- అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయాలి
- ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

ఎల్కతుర్తి, నవంబర్ 26 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందుతాయని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని దండేపల్లి, పొలాడిపల్లి, కేశవాపూర్, ఎల్కతుర్తి గ్రామాల్లో జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు కోలాటాలు, బతుకమ్మలు, డప్పుచప్పుళ్లతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే ఎన్నో పైరవీలు చేసేవారని, ఇప్పుడు ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వాదేనన్నారు. ఒకప్పుడు కరువు, కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో రైతన్నలు నేడు 24గంటల కరెంట్, సాగునీటితో ఆనందంగా పంటలు పండించుకుంటున్నారని, పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నదని చెప్పారు. గత ప్రభుత్వాల పాలనను ప్రజలు చూశారని, బీఆర్ఎస్ ప్రాలనను బేరీజు వేసుకొని ప్రజలు నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మవద్దని సూచించారు.

**కాంగ్రెస్ తాత్సారంతో బలిదానాలు**
**-జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్**

ప్రత్యేక తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ అలుపెరగని ఉద్యమాలు చేశారని, కానీ కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకుండా తాత్సారం చేయడంతోనే అనేక మంది బలిదానాలు చేసుకున్నారని జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ అన్నారు.

పోరాడి సాధించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ అన్ని విధాలా అభివృద్ధి చేసి, దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపారని, హుస్నాబాద్ నియోజకవర్గాన్ని కూడా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఆదర్శంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ప్రజలు పనిచేసే ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

### బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

మండలంలోని దండేపల్లి, కేశవాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సూరారం నుంచి 100మంది ముదిరాజ్ కులస్తులు, కేశవాపూర్ నుంచి 50మంది, దండేపల్లి నుంచి 20మంది, ఆరెపల్లి నుంచి 15మంది బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువా కప్పి ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

## రాష్ట్రాన్ని పోరాడి సాధించుకున్నం

- 1200 మంది అమరుల ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

ఎల్కతుర్తి, నవంబర్ 26: తెలంగాణ ఇచ్చామని చెప్పే కాంగ్రెస్ నాయకులు ఒకసారి గుండెలమీద చేయి వేసుకొని మాట్లాడాలి.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఊరుకే ఇవ్వలేదు.. తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్నారని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ఎల్కతుర్తిలో ఆదివారం రాత్రి జరిగిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ మీమే ఇచ్చామని మాట్లాడే తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఒకసారి ఉద్యమకాలాన్ని గుర్తుకు చేసుకోవాలని హితవు పలికారు. తెలంగాణ కోసం అప్పటి టీఆర్ఎస్ నాయకులందరూ రాజీనామా చేస్తే కాంగ్రెస్ నాయకులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పుణ్యానికి ఇవ్వలేదని, పోరాడి సాధించుకున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఏర్పాటును ఆలస్యం చేసి శ్రీకాంతాచారి వంటి 1200 మందిని కాంగ్రెస్ బలితీసుకుందని ఆరోపించారు. ఉద్యమకాలంలోనే కేసీఆర్ తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అనే నినాదంలో ఉద్యమించారని, తద్వారానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని చెప్పారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అమలు చేయడం లేదని విమర్శించారు.



కొత్తకొండలో ప్రచారం చేస్తున్న బాలమణి

### బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

భీమదేవరపల్లి, నవంబర్ 26: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముస్తాఫాపూర్, కొత్తకొండలో వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు గొల్లెన బాలమణి, ఎంపీటీసీ యాటపోలు రాజమణి, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. కారు గుర్తుకు ఓటు వేసి హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు శివరాత్రి రాజు, మహేందర్, పోచయ్య, ఉప్పలయ్య, కుమార్, కొమురమ్మ, సరోజన పాల్గొన్నారు.

### ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

హనుమకొండ సబర్బన్, నవంబర్ 26: హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు ఆధ్వర్యంలో సంస్థ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వరరావు, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు సదర్లాల్, అశోక్‌కుమార్, మధుసూదన్, మోహన్‌రావు, రాజుచౌహాన్, రవీంద్రనాథ్, కేవన్ గుట్ట కిషన్, అశోక్, కంపెనీ సెక్రటరీ వెంకటేశం, జీఎంలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

## అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటేయండి



పొట్లపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న డాక్టర్ అనురాగ్

హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట, నవంబర్ 26 : హుస్నాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అల్లుడు డాక్టర్ అనురాగ్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి, పందిల్ల, మహ్మదాపూర్, అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరి, అంతకపేట, గౌరవెల్లి గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గానికి గ్రామ గ్రామాన బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు నిర్మించి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం బం గారు తెలంగాణగా మారిందన్నారు. మరోసారి ప్రజలందరూ కారు గుర్తుకే ఓటు వేసి సతీశ్‌కుమార్‌ను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారుతోనే అభివృద్ధి, సంక్షేమం



2వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ బోజు రమాదేవి

హుస్నాబాద్ టౌన్, నవంబర్ 26 : బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్‌కు మద్దతుగా పట్టణంలోని వాడవాడల ప్రచారం ఉధృతంగా సాగుతున్నది. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బోజు రమాదేవి, మ్యాదరబోయిన వేణు, గూళ్ల రాజు, బొల్లి కల్పన, మిర్యాల రమేశ్, బొజ్జ హరీశ్, వాల సుప్రజ, నాయకులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల మాయలో పడొద్దు

- బీఆర్ఎస్‌కు మించిన మ్యానిఫెస్టో లేదు
- పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం
- మరోసారి ఆశీర్వదించండి..
- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్



కొత్తపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న వొడితెల సతీశ్ కుమార్

భీమదేవరపల్లి, నవంబరు 26 : ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు కల్లబొల్లి మాటలు మాట్లాడుతారని, వారి మాయలో పడవద్దని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్ కుమార్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ రూపొందించిన మ్యానిఫెస్టోకు మించింది మరొకటి లేదన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కేసీఆర్ నిరంతరం పాటుపడ్డారని వివరించారు. కొత్తపల్లి గ్రామంలో అసైన్డ్ భూములు చాలా వరకే ఉన్నాయని, పేదలకు పట్టాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.16లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ముల్కనూరు ఎస్‌బీఐ నుంచి కొత్తపల్లి మీదుగా దామెర వరకు రోడ్డు మంజూరైందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడిన తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సతీశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి..

హుస్నాబాద్, నవంబర్ 26 : హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత వొడితెల సతీశ్‌కుమార్‌ను ప్రజలందరూ ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి కోరారు. తీవ్ర జ్వరంతో హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం నియోజకవర్గ ప్రజలకు తన సందేశం పంపించారు. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దిన బీఆర్ఎస్ అభ్యర్థిగా మూడోసారి పోటీ చేసి ప్రజల ఆశీర్వాదం కోసం నిరంతర ప్రచారం చేస్తున్న సతీశ్‌కుమార్‌కు అన్నివర్గాల ప్రజలు తమ మద్దతును తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.